క్లుప్తంగా

మెలాకా వర్సిటీతో ఆర్‌ఆర్‌ఐటీసీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆర్‌ఆర్‌ఐటీసీ, మెలాకా వర్సిటీ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: మలేషియాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ బ్లాక్‌చైన్ సదస్సులో మెలాకా యూనివర్సిటీతో నగరానికి చెందిన ఆర్‌ఆర్‌ఐటీసీ సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది. బ్లాక్‌చైన్, డిజిటల్ కరెన్సీ, క్రిప్టోపై సమాచార మార్పిడి కోసం ఈ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఆర్‌ఆర్‌ఐటీసీ సంస్థ ప్రతినిధులు డాక్టర్ రత్నరాజు, వంశీతో మెలాకా వర్సిటీ ప్రతినిధులు డాక్టర్ అబ్దుల్ రజాక్ బిన్ ఇబ్రహీం, డాక్టర్ దటిన్ జం ఒప్పందం పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మస్తకిర్ ముస్రా, డాక్టర్ వెస్వల్ ఇలి, వీరుమామ పాల్గొన్నారు.

ప్రజా రవాణా మేలు



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం స్పందనతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించి, తిరిగి బస్సులో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా వారంలో ఒక్క రోజు ప్రతి ఒక్కరూ ప్రజా రవాణాను ఉపయోగించాలని కోరారు.

అప్రెంటిస్‌షిప్‌తో విద్యార్థుల్లో నైపుణ్యం



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు


మద్దిలపాలెం: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ ఎంతో దోహదపడతాయని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌పై 12ల కళాశాలల అధ్యాపకులకు లెర్నింగ్ మేనేజ్‌మెంట్ విధానంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. అనంతరం ఆయా కళాశాలల విద్యార్థులు నైపుణ్యం సాధించేలా శిక్షణ పొందిన అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ పి.వాణి, అప్రెంటిస్‌షిప్ కో–ఆర్డినేటర్లు రాజశేఖర్, మాస్టర్ ట్రైనర్లు జి.శ్రీనివాసరావు, సిహెచ్.లలిత, కె.రవిబాబు పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కు లీజుపై నిరసన

మద్దిలపాలెం: పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు ముడసర్లోవ పార్కును కట్టబెట్టడాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో నాయకులు ఆర్కేఎస్వీ కుమార్, నరేంద్రకుమార్, వి.కృష్ణారావు ఈ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ పూర్ణామార్కెట్, ముడసర్లోవ పార్కును ప్రైవేటు వ్యక్తులకు లీజుకిస్తూ జీవీఎంసీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీనిపై ఉద్యమం చేపడుతున్నామన్నారు.

మృత్యుంజయేశ్వర ఆలయం ముస్తాబు

- నేటి నుంచి మూడు రోజుల పాటు ప్రారంభోత్సవాలు
- శివలింగ, నందీశ్వర, ధ్వజ స్తంభం, కలశ ప్రతిష్ట



నూతనంగా నిర్మించిన శివాలయం



ప్రతిష్ట కార్యక్రమానికి సిద్ధమైన హోమశాల

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని అసంగానంద ఆశ్రమంలో పునర్నిర్మించిన శ్రీమృత్యుంజయేశ్వర ఆలయం ప్రారంభోత్సవాన్ని సిద్ధమైంది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీశివలింగ, నందీశ్వర, ధ్వజ స్తంభ, శిఖర కలశ ప్రతిష్టా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెదవాల్తేరుకు చెందిన చిన్నిపల్లి కొండలరావు, సత్యవతమ్మ దంపతులు అసంగానంద ఆశ్రమం ఏర్పాటుకు 436 చదరపు గజాల స్థలం దానమిచ్చారు. అక్కడే గురుమందిరం, శివాలయం నిర్మించి నిత్య పూజలు, పారాయణాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శివాలయం చిన్నదిగా ఉండడం, శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కేవలం ఆరు నెలల కాలంలో దాదాపు రూ.30 లక్షల నిధులతో దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు.

9న ప్రతిష్టాపన కార్యక్రమం

విష్ణు సేవానందగిరి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రతిష్టాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 9న ఉదయం 8.47 గంటలకు సుముహూర్తంలో ఈ ప్రతిష్టాపన కార్యక్రమం జగద్గురు మఠం, శ్రీలలితాంబిక పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి చేతుల మీదుగా నిర్వహించనున్నారు.

భక్తులతో స్వయంగా పూజలు

అసంగానంద ఆశ్రమం శివాలయంలో భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం ఉంది. ఇదే సంప్రదాయాన్ని నూతనంగా నిర్మించే ఆలయంలో కొనసాగించనున్నారు. భక్తులు స్వయంగా స్వామిని దర్శించి, అభిషేకం, పూజలు జరుపుకొనే అవకాశం కల్పించనున్నారు. గోదావరి జిల్లా పెద్దాపురం నుంచి వచ్చిన శిల్పులు ఎంతో శ్రమించి, నిర్విరామంగా పనిచేసి సకాలంలో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఆశ్రమంలో అన్నదానం చేయడానికి ప్రత్యేకంగా మండపం నిర్మించారు.

- తొలిరోజు మంగళవారం కార్యక్రమాలు గణపతి పూజతో ప్రారంభమై, పంచగవ్యప్రాశన, కలశస్థాపన, దేవతా ఆవాహన, నక్షత్రహోరతులు, యాగశాల ప్రవేశం, అగ్నికార్యం, మండప దేవతా ఆవాహన హోమాలు, మహా నైవేద్యం నిర్వహించనున్నారు. సాయంత్రం ఉపనిషత్, భగవద్గీత, వేద పారాయణ, శివ, నంది, ధ్వజ స్తంభ యంత్రములకు సుగంధ ద్రవ్యములతో జలాధివాసం, అభిషేకం, శాంతి మంత్ర పఠనం చేయనున్నారు.

కనుజు మృతిపై హడావుడి



కనుజు కళేబరాన్ని దహనం చేస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆరిలోవ: సీతకొండ వద్ద కనుజు మృతి చెందడంతో స్థానికుల్లో కొంతసేపు హడావుడి నెలకొంది. విశాఖ వేలీ స్కూల్ దరి కూచిపూడి అకాడమీ వెనక సీతకొండను ఆనుకుని ఓ ఆడ కనుజు కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. దుర్వాసన రావడంతో కూచిపూడి అకాడమీ వాచ్‌మన్ సోమవారం ఉదయం వెతకగా.. ఓ చోట కనుజు మృతి చెంది కనిపించింది. ఈ విషయాన్ని అకాడమీ నిర్వాహకులకు తెలియజేయజేశాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన కనుజు నుంచి దుర్వాన రావడంతో దగ్గరికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ కనుజును సిబ్బందితో దహనం చేయించారు. అంతవరకు బాగానే ఉంది. సీతకొండపై తిరుగుతున్న జింకను ఎవరో వేటాడి కాల్చి తినేస్తున్నారంటూ అటుగా వెళ్లే వాహనచోదకులు, స్థానికులు హడావిడి చేశారు. రోడ్డుపై వాహనాలు నిలిపి అంతా అక్కడ కనుజును దహనం చేసిన చోటకు వెళ్లి గుమిగూడారు. అక్కడ అటవీశాఖ సిబ్బందే దహనం చేస్తుండడంతో తిరుగుముఖం పట్టారు. వృద్ధాప్యం కారణంగా సీతకొండపై తిరుగుతూ అక్కడి నుంచి జారిపడి మృతి చెంది ఉంటుందని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కోటేశ్వరరావు తెలిపారు. ఇది మృతి చెంది సుమారు వారం పైగా అవుతుందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. పోస్టుమార్టం కోసం జూ వైద్యుడిని తీసుకొచ్చామని, అయితే తీవ్ర దుర్వాసన రావడంతో పోస్టుమార్టం చేయలేని పరిస్థితి నెలకొందని, అందుకే అక్కడ వెంటనే దహనం చేసినట్టు ఆయన తెలిపారు.

విశ్రాంత పోలీస్ అధికారుల కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత పోలీస్ అధికారులు

బీచ్ రోడ్డు: విశ్రాంత పోలీస్ అధికారుల అసోసియేషన్ విశాఖపట్నం రేంజ్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. అధ్యక్షుడిగా మాజీ ఐపీఎస్ లక్ష్మణ్ మోహన్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.రామకృష్ణ, కార్యదర్శిగా ఎన్.ఎస్.ప్రసాద్ ఎన్నికయ్యారు.

ఆశా కార్యకర్తలు.. గృహాల సందర్శన తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి ఆశా కార్యకర్త తమ పరిధిలో ఉన్న గృహాలను తప్పనిసరిగా సందర్శించి, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆశా కార్యకర్తలకు 6, 7 మాడ్యూల్స్‌పై శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణుల వివరాలను 12 వారాలలోపు నమోదు చేయాలని సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో 108 వాహనాల ద్వారా సమీప ఆస్పత్రికి రిఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.ఉమావతి, సత్యవతి, కె.ధర్మేంద్ర, ఇతర అధికారులు వై.స్వర్ణలత, లక్ష్మి, మణికుమారి పాల్గొన్నారు.

వర్సిటీకి విద్యార్థులే గర్వకారణం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ముగ్గురు జాతీయ సేవా పథకం వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. వర్సిటీకి చెందిన జె.వాసు, వి.ఎస్.ఎస్.లక్ష్మణ్, పి.రమ్య గత నెల 1 నుంచి 25వ తేదీ వరకు ఢిల్లీలో శిక్షణ పొంది 26న నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్రపతి అవార్డు సాధించిన ధనియాల సాయిని కూడా ఆయన అభినందించారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు పెరేడ్ విశేషాలు, ఢిల్లీలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిని కలిసిన సందర్భాలను వివరించారు. విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా విద్యార్థులు నిలుస్తున్నారని వీసీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఐటీఐ సమన్వయకర్త డాక్టర్ పి.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్ కేటాయింపుల్లో మహిళలకు ప్రాధాన్యం'



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల కిషోర్

ఎంవీపీకాలనీ: కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం కల్పించారని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్ అన్నారు. ఈ మేరకు లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలికల సంరక్షణ, పోషకాహారం వంటి అంశాలకు రూ.25 వేల కోట్లు కేటాయింపులు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి లక్ష్మీసంతోషి, జిల్లా ఇన్‌చార్జి దిలీప్‌వర్మ, జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

తెలుగు సినీ ఉత్సవం ప్రారంభం



కె.విశ్వనాథ్, జమున చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సినీ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య

సీతంపేట: తెలుగు సినిమా ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్తప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలై 91 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మూడు రోజుల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం సినీ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా సినీ దిగ్గజాలు కె.విశ్వనాథ్, జమున చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ కావాలని ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశాఖలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, సినీ ప్రేక్షకులు ఒక కమిటీగా ఏర్పడి పాలకులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. తాను ఇక్కడే చదివానని, విశాఖపై పూర్తి అవగాహన ఉందని, అందుకే తన చిత్రాలు ఎక్కువగా ఇక్కడే షూటింగ్ చేశానని, భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తానని తెలిపారు. అనంతరం కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, కాశీవిశ్వేశ్వరరావు, సునర్ల శ్రీనివాస్, బి.చిన్నారావు పాల్గొన్నారు.

రోడ్డుపై రైతుల వ్యాపారాలు



సీతమ్మధార రైతుబజారు బయట కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో ఆర్గానిక్ కంటైనర్‌తోపాటు మరో కంటైనర్ ఏర్పాటు చేయడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. కూరగాయలు అమ్ముకునేందుకు చోటు లేక బజారు బయటకు వచ్చి విక్రయించుకునే పరిస్థితి నెలకొంది. బజారులో నడిచే మార్గం చిన్నది కావడంతో ఇటు రైతులు.. అటు వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతుబజారులో 302 మంది రైతులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వ్యాపారం చేస్తుంటారు. ఉదయం 120 మంది, సాయంత్రం 70 మంది కూరగాయలు విక్రయిస్తుంటారు. బజారులో కంటైనర్ ఏర్పాటుతో కొందరు రైతులు రోడ్డపైకి వచ్చి కూరగాయలు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి



గృహ సారథులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త విజయనిర్మల, పరిశీలకుడు సూర్యనారాయణరాజు, కార్పొరేటర్లు

ఆరిలోవ: గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పిలుపునిచ్చారు. నియోజకవర్గం పరిధి 10, 11, 12, 13 వార్డుల గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లతో తోటగరువు దరి ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అక్కరమానితో పాటు నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజు, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, 10, 11 వార్డుల నాయకులు పాల్గొని గృహ సారథులు, కన్వీనర్లతో కలసి వైఎస్సార్‌సీపీ విధి విధానాలు సక్రమంగా పాటిస్తామని, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. 10, 11 వార్డులకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, 11, 12 వార్డులకు ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఈ సమావేశం నిర్వహించారు. ఆయా సమావేశాలలో విజయనిర్మల మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి వల్ల కలిగే లబ్ధి గురించి ప్రజలకు వివరించాలన్నారు. అంతా కలసికట్టుగా 2024లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం పరిశీలకుడు, కార్పొరేటర్లు మాట్లాడుతూ కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వార్డుల్లో గృహసారథులు ముందుండి పార్టీని నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కొరికాని మోహనరావు, అటవీ కార్పొరేషన్ డైరెక్టర్ వనము వరలక్ష్మి, ఆయా వార్డుల నాయకులు వైదా నారాయణరావు, బొండా శ్రీను, గొలగాని శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, కెల్ల సత్యనారాయణ, శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మద్దిలపాలెం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు తంగేటి సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 15, 16వ వార్డుల గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్ల సమీక్ష సమావేశం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ప్రతిజ్ఞ చేయించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడానికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో 15, 16వ వార్డుల కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య, మొల్లి లక్ష్మి, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు మొల్లి అప్పారావు, నడింపల్లి కృష్ణంరాజు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న 15, 16వ వార్డుల గృహ సారథులు, కన్వీనర్లు, తదితరులు

మౌలిక వసతుల మెరుగుకు కృషి

- 19వ వార్డు క్షేత్ర స్థాయి పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



19వ వార్డు తీరంలో పర్యటిస్తున్న కమిషనర్ రాజాబాబు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో మౌలిక వసతుల మెరుగుకు కృషి చేస్తానని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలో భాగంగా ఆయన సోమవారం 19వ వార్డులోని పెదజాలరిపేట, శివగణేష్‌నగర్, రేసవానిపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల వెంబడిన ఉన్న తీర ప్రాంత పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పెదజాలరిపేటలో గెడ్డ నిర్మాణం, వీధి దీపాల సమస్య, ఈపీడీసీఎల్ యాజమాన్యం పూడ్చకుండా వదిలేసిన గోతులు, శ్మశానవాటికకు రక్షణ గోడ నిర్మాణం, రేసవానిపాలెం గెడ్డ ద్వారా తీరంలో కలుస్తున్న చెత్తాచెదారం నిర్మూలన, తదితర సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి శాస్త్రి, డీసీ ఫణిరామ్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞ యాగాలతో ప్రపంచ శాంతి



వ్రతం నిర్వహిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ



పాల్గొన్న 108 మంది దంపతులు

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- వైభవంగా సామూహిక శ్రీరామదేవుని వ్రతం

ఎంవీపీ కాలనీ: యజ్ఞాలు, యాగాలు, క్రతువులు ప్రపంచ శాంతికి వారధుల లాంటివని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో భాగంగా ఆయన 108 మంది దంపతులతో సామూహిక శ్రీరామదేవుని వ్రతం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతిని నెలకొల్పే యజ్ఞాలు భారతీయ సనాతన సంస్కృతిలో భాగమన్నారు. సమాజానికి మంచి చేసే ఆ సంస్కృతిని ప్రతిఒక్కరూ ఆచరించాలని సూచించారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కేవీఎస్ శ్యామ్, అరుణ గాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ ఈ వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 మంది దంపతులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులను కాపాడుకుందాం



ఆర్పీ పేట హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

కంచరపాలెం: రైల్వే ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రైల్వే భద్రతా దళ(ఆర్పీఎఫ్) అధికారులు పిలుపునిచ్చారు. రామూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ నేతృత్వంలో సోమవారం ఆర్పీఎఫ్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై ఆకతాయిలు చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆర్పీఎఫ్ సీఐ పి.మోహన్‌రావు, ఎస్ఐ రాజురంజన్ మాట్లాడుతూ వందే భారత్ రైలుపై ఆకతాయిలు రాళ్లు వేయడం దుశ్చర్య అన్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు విసరడం వల్ల అవి ప్రయాణికులకు తగిలి గాయాలపాలయ్యే అవకాశముందని, ఇటువంటి పనులు మానుకోవాలని కోరారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు రైల్వే ట్రాక్‌లపై సెల్ఫీలు వంటి ప్రమాదకరమైన పనులు, నిషిద్ధ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు దాటడం వంటి పనులు చేయకూడదని అవగాహన కల్పించారు.

ఆకతాయిలకు దూరంగా ఉండండి..

కంచరపాలెం లా అండ్ ఆర్డర్ ఎస్ఐ దివ్యభారతి మాట్లాడుతూ కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఆగతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయని, పాఠశాలల్లో విద్యార్థులు జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. కంచరపాలెం పరిధిలో వందే భారత్ రైలుపై ఆకతాయిలు రాళ్లు విసిరిన ఘటన జరగడం మచ్చగా మిగిలిందన్నారు. బాలికలు ఆకతాయిలతో చెడు సావాసం చేయొద్దని సూచించారు. చిన్నారులపై లైంగిక వేధింపులు, దూషణలు సరికాదని, వారితో స్నేహంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.రమేష్‌గౌరీ, సోషల్ వర్కర్ కె.వెంకటేశ్వరరావు, సీఆర్‌పీ ఎల్.చైతన్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్ నేడు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఫిల్మ్ మేకింగ్‌పై ఉచిత వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ చిత్ర దర్శకుడు, నిర్మాత, రచయిత వి.ఎన్.ఆదిత్య పాల్గొని ఫిల్మ్ మేకింగ్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయసు దాటిన ఔత్సాహిక యువతీ యువకులు, విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.